## క్లుప్తంగా

### తనిఖీలు ముమ్మరం చేయండి



పెడన: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండి, తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రతి వాహనం కూడా విడిచిపెట్టకుండా సోదా చేయాలని మచిలీపట్నం పార్లమెంటు వ్యయ పరిశీలకులు జాన్ కింగ్స్ స్లే, పెడన నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వికాస్ చంద్ర కరోల్ స్పష్టం చేశారు. శనివారం వీరు పెడన ఈఆర్వో కార్యాలయంలో పెడన నియోజకవర్గానికి సంబంధించిన వివిధ బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడ చెక్ పోస్టులు పెట్టిందీ, వాటి సరిహద్దులు, అక్కడ సిబ్బంది తదితర విషయాలను మచిలీపట్నం డీటీఎస్ డీఎస్పీ రమేష్ బాబు వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సమయం ఇదేనని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈఆర్వో, పెడన తహసీల్దారు ఆర్.రాంబాబు, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, వివిధ టీంలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### స్వామివారి సన్నిధిలో ప్రత్యేకాధికారులు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని సార్వత్రిక ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు నరహరి సింగ్ బంగార్, నియోజకవర్గ పరిశీలకులు ప్రవీణ్ చౌహాన్ వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, అర్చకులు వెంకటేశ్వరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్ స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య, ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు బీ శ్రీనివాసరావు, రమణ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు డల్లాస్‌లో ‘మీది బందరా..!

మచిలీపట్నం టౌన్: డల్లాస్‌లో స్థిర పడిన బందరు వాసుల ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం అక్కడి మినర్వా బ్యాంకెట్ హాల్లో పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మద్దుల గిరీష్ కుమార్, దొరరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ‘మీది బందరా’.. అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించటం జరుగుతుందన్నారు. డల్లాస్, యూఎస్ఏలో స్థిరపడిన బందరు వాసులు దాదాపు 400 మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అమెరికాలో బందరు వాసుల సందడి నెలకొననుందన్నారు. బందరుకు చెందిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి విధిగా హాజరై ప్రేమానురాగాలను పంచుకోవాలని వారు కోరారు.

### మచిలీపట్నం ఇన్‌చార్జి డీవైఈవోగా సింగ్

పెడన: మచిలీపట్నం ఇంచార్జి ఉప విద్యాశాఖాధికారిగా బీసీఎస్ సింగ్ ఇటీవల బాధ్యతలను స్వీకరించారు. మచిలీపట్నం డీవైఈవో పోస్టు ఖాళీగా ఉండటంతో గూడూరు ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ సింగ్ ఇటీవల మచిలీపట్నం డీవైఈవోగా బాధ్యతలను స్వీకరించారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) మచిలీపట్నం డివిజన్ సభ్యులు శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. డీవైఈవోను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ చైర్మన్ సుందర్ రామ్, జిల్లా అధ్యక్షుడు గౌరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మతుల్లా ఖాన్, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి మోహనరావు, డివిజన్ కోశాధికారి ప్రభాకర్, మచిలీపట్నం డివిజన్ సీనియర్ సభ్యులు రామకృష్ణ, శివప్రసాద్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

### వలంటీర్ల రాజీనామా



చల్లపల్లి: చల్లపల్లి మండలంలోనూ గ్రామ వలంటీర్ల రాజీనామాల పర్వం మొదలైంది. శనివారం మండల పరిధిలోని మంగళాపురం గ్రామానికి చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లు బొర్రా ప్రమోద్ కుమార్, పేరం శివ నాగరాజు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్యాంసన్‌కు సమర్పించారు.

**71 మంది వలంటీర్ల రాజీనామా**

ఘంటసాల: ఘంటసాల మండలంలో శనివారం 71 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. ఘంటసాల, కొత్తపల్లి, శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, లంకపల్లి గ్రామాల్లో 71 మంది గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులు బీ విజయలక్ష్మి, బీ అర్జునరావు, జీ శ్రీనివాసరావు, అశ్విన్ కుమార్‌లకు సమర్పించారని ఎంపీడీఓ బీ మారుతీ శేష మాంబ తెలిపారు.

# సుపరిపాలన అందించిన సీఎం జగన్

- ఒక్కసారి నాకు..మరో సారి జగన్‌కు అవకాశం ఇవ్వండి
- పెడన ప్రజాదీవెనలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్



ఉప్పాల రమేష్ (రాము), జెడ్పీ చైర్‌పర్సన్ హారికలను అభినందిస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి

పెడన: ఒక్క సారి నాకు..మరొక్క సారి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వండి..మీ వంతు సాయంగా రెండు ఓట్లు కూడా ఫ్యాన్ గుర్తుకు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. శనివారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి పట్టణంలోని 12, 13, 14వ వార్డులలో ప్రజాదీవెనలో భాగంగా ఆయా వార్డులలో గడప గడపకు తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లను వేయాలని కోరారు. వీరి ప్రచారంలో కృష్ణా జిల్లా సెంట్రల్ కో ఆపరేటివ్ (కేడీసీసీ)బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి రాము, హారికలను కలిసి సత్కరించి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. వీరితో పాటు పద్మావతి కాసేపు ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాము, హారికలు మాట్లాడుతూ అహర్నిశలు శ్రమిస్తూ పేదల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ సుదీర్ఘపాదయాత్ర ద్వారా ఏం చేయాలని ఆలోచన చేసి వాటిని తూచతప్పకుండా అమలు చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అటువంటి ముఖ్యమంత్రిని మనం మళ్లీ ఎన్నుకోవాలని, అందుకు మీరంతా ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. అవే పథకాలు అమలు చేయడమే కాకుండా అమ్మఒడి రెండు వేలకు పెంచారని, రైతు భరోసా పథకం నగదు కూడా పెంచారన్నారు. అమలు చేయదగ్గ పథకాలను మాత్రమే జగనన్న చెప్పారని, చెప్పాడంటే తప్పకుండా చేసి చూపిస్తారని స్పష్టం చేశారు. నాకు ఒకసారి అవకాశం ఇచ్చి చూడాలని, మళ్లీ మీరే కావాలనే విధంగా సేవలను అందిస్తానని రాము అన్నారు. మా వారు రాము ఎమ్మెల్యేగా నిలబడ్డారని, ఆయన్ని గెలిపించి ఆశీర్వదించాలని హారిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, బళ్ల గంగయ్య, మెట్ల గోపి, బాబులాల్, రెహతున్నీసా, వీరంకి నరసింహారావు, పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆనందప్రసాద్, పార్టీ నాయకులు వన్నంరెడ్డి మహంకాళరావు, వీర్నాల మాధవరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విజయం నీదేనంటూ అవ్వాతాతల ఆశీర్వాదం

**సుల్తానగరంలో పేర్ని కిట్టు ప్రచారానికి విశేష స్పందన**



బందరుకి కాబోయే ఎమ్మెల్యే నువ్వే అంటున్న మహిళ

కోనేరుసెంటర్: మనవడా తాత పేరు నిలబెట్టాలి.. నాన్నకు ఉన్న పేరు ప్రఖ్యాతలను మరింత పెంచాలి..వచ్చే ఎన్నికలలో విజయం నీదే.. మా బందరు ఎమ్మెల్యే నువ్వే..పెద్ద దాన్ని విజయోస్తు అంటూ ఆశీర్వదిస్తున్నాను..అంటూ బందరు మండలం సుల్తానగరం గ్రామానికి చెందిన ఓ అవ్వ పేర్ని కిట్టుని ఆశీర్వదించింది. బిడ్డ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకోవాలి.. పేర్ని నాని అంటే ప్రజా నాయకుడే కాదు..పేదల పాలిట పెన్నిధి.. మాలాంటోళ్లకి ఏ కష్టం వచ్చినా నాన్నే చూసుకునేవాడు.. నువ్వు అలాగే మమ్మల్ని చూసుకోవాలి.. సరేనా అంటూ ఓ నడి వయసు మహిళ. అన్నా విజయం నీదేనన్నా.. నీ వెనక మేమున్నాం..నువ్వు ధైర్యంగా ముందుకు వెళ్లన్నా అంటూ గ్రామానికి చెందిన యువకులు ప్రచారంలో పాల్గొన్న పేర్ని కిట్టుకి కల్పిస్తున్న భరోసా అతనిలో గెలుపుపై మరింత బలాన్ని చేకూరుస్తోంది. ప్రచారంలో పాల్గొనేందుకు గ్రామానికి వెళ్లిన పేర్ని కిట్టుకి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు, పెద్దలు పేర్ని కిట్టుకు ఎదురేగి ఘన స్వాగతం పలుకుతున్నారు. దగ్గరుండి ఇంటింటికీ తీసుకువెళ్లి బాబును బలపరచాలంటూ గ్రామస్తులకు చెబుతున్నారు. ఊరు బాగుండాలన్నా ఊళ్లో మనం బాగుండాలన్నా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనంటూ చెప్పడంతో పాటు ముఖ్యమంత్రి బలపరిచిన బాబుని మనమంతా కలిసి వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని చెబుతున్నారు. ప్రచారంలో పాల్గొన్న కిట్టు సైతం తాను అధికారంలోకి వస్తే ఊరు ప్రజలు బావుంటారనే భరోసాను గ్రామస్తుల్లో కలిగిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో సుల్తానగరంలో రెండో రోజు కొనసాగిన ప్రచారంలో పార్టీ నాయకులతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కిట్టుకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

# ‘పది’లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని గాయత్రిని సన్మానిస్తున్న కార్పొరేటర్ భోగాది సాయిబాబు, బేతపూడి రవి



విద్యార్థి అనీష్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, యర్రా శ్రీనివాసకుమార్

మచిలీపట్నం టౌన్: నగర పాలకసంస్థ పరిధిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు కార్పొరేటర్లు ప్రోత్సహిస్తున్నారు. నగరంలో ఏడు మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిది మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించారు. 600 మార్కులకు గాను చిలకలపూడి పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన దేవనబోయిన చరిష్మా రత్నమణి, వాలిశెట్టి బాలనాగలక్ష్మిలు 570 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.విశ్వశ్రీ 565 మార్కులు, పామర్తి గాయత్రి 544 మార్కులు, దేశాయిపేట ఉన్నత పాఠశాలకు చెందిన మెట్ల జ్ఞానకోట అనీష్ 559 మార్కులు, బందరుకోట పాఠశాలకు చెందిన బచ్చుల ప్రకాష్ 555 మార్కులు, కాలేఖాన్‌పేట పాఠశాలకు చెందిన ఎం.భావన 552 మార్కులు, గిలకలదిండి పాఠశాలకు చెందిన వాటపల్లి పూర్ణప్రభు 545 మార్కులు, రుస్తుంబాద బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పల్లెం పార్థసారధి 528 మార్కులు సాధించారు. వీరిని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు శనివారం వారి గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సత్కరించి స్వీట్లు అందజేశారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆనందోత్సాహాలకు గురై కార్పొరేటర్లు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 33, 36, 29, 46 డివిజన్ల కార్పొరేటర్లు మీర్ అస్గర్‌అలీ, మాచవరపు రాంప్రసాద్, కట్టా కేధారేశ్వరరావు, భోగాది సాయిబాబు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, 11వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ తదితరులు విద్యార్థులను సన్మానించారు.

# మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

కృత్తివెన్ను/గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గడిచిన ఐదేళ్లలో ఇచ్చిన మాట ప్రకారం చెప్పినవన్నీ అమలు చేసిన జగనన్న 2024 ఎన్నికల నేపథ్యంలో మరో మారు తమ మేనిఫెస్టోను ప్రకటించారు. నవరత్నాలతో పేదప్రజల ఆర్థికాభివృద్ధిని పెంపొందించేలా రూపొందించిన మేనిఫెస్టోపై నాయకుల నుంచి సామాన్య ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెరవేర్చగలిగిన హామీలు మాత్రమే జగనన్న మేనిఫెస్టోలో పొందుపరిచారని, ఆయన ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతారన్న నమ్మకం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది..

### కాపునేస్తం పెంపుతో మరింత ప్రగతి



గతంలో కాపునేస్తం పేరుతో 45 సంవత్సాలు నిండిన ప్రతి కాపు మహిళకు ఏడాదికి రూ.15 వేల వంతున నాలుగేళ్లలో రూ.60 వేలు అందించారు. ఇప్పుడు దాన్ని రూ.1.20 లక్షలకు పెంచడం ఎంతో సంతోషకరమైన విషయం. జగనన్న ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతాడన్న నమ్మకముంది.

– పిన్నెంటి మహేష్, ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్

### పేదల పక్షాన నిలిచారు



మత్స్యకార భరోసా పేరుతో ఇప్పటి వరకు ఏడాదికి రూ.10 వేలు వంతున ఐదేళ్లలో రూ.50 వచ్చాయి. రాబోయే రోజుల్లో భరోసాను రూ.లక్షకు పెంచుతున్నట్లు జగనన్న మేనిఫెస్టోలో పేర్కొనడం ఎంతో సంతోషం. దీంతో మత్స్యకారులకు మరింత ఆర్థిక భరోసా లభించింది. పేదల పక్షాన నిలిచే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. మాట ఇచ్చాడంటే అమలు చేసి తీరుతాడంతే.

–కొక్కిలిగడ్డ బాపూజీ, జేసీఎస్ కృత్తివెన్ను మండల ఇన్‌చార్జి, చినగొల్లపాలెం

### సంతోషాన్నిచ్చిన మేనిఫెస్టో



ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో తెలిసిన వ్యక్తి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. కల్లబొల్లి కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపే మనస్తత్వం ఆయనది కాదు. ఏదైనా చేస్తానంటే ఖచ్చితంగా చేసి చూపించే నైజం జగనన్నది. నవరత్నాలు పూర్తిగా అమలు చేయడమే కాకుండా పెంచి మరీ అమలు చేస్తాననడం ఎంతో సంతోషదాయకం.

–కూనసాని గరుడప్రసాద్, ఎంపీపీ, కృత్తివెన్ను

### అమలు చేస్తారన్న నమ్మకం..



మేనిఫెస్టో అమలు చేస్తారన్న నమ్మకం ఉంది. గతంలో మేనిఫెస్టోలకు ఎన్నికల తర్వాత విలువ ఉండేది కాదు. కానీ జగనన్న ఆ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చివేశాడు. గత సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ఎన్నికల ముంగిట విడుదలైన మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది.

–బెజవాడ రామకుమర్, మల్లవోలు

### చేయగలిగేవే చెప్పారు



మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేయగలిగిన హామీలనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పొందుపర్చారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చాలన్న లక్ష్యం మేనిఫెస్టోలో కనిపించింది. అమలు కాని హామీలు ఇవ్వడం ద్వారా ప్రజలను మభ్యపెట్టడం జగనన్న నైజం కాదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి అవగాహనతో ఇచ్చిన మేనిఫెస్టో నూరుశాతం అమలు చేస్తారన్నది మా నమ్మకం.

–ఆకూరి శ్రీనివాసరావు, గూడూరు

### దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



చల్లపల్లి: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కే రాములు నాయక్ సూచించారు. శనివారం చల్లపల్లిలో సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగ బాల, బాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పీవీ రావు, వైద్యులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమానికి సాయం



చల్లపల్లి: గ్రామంలోని పార్వతమ్మ తోటలో ఉన్న ఆదరణ గృహం వృద్ధాశ్రమానికి అవనిగడ్డ అగ్నిమాపక శాఖ అధికారి ఎస్‌వీవీ ప్రసాద్ సహాయం చేశారు. శనివారం ఆశ్రమాన్ని సందర్శించి బియ్యం, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు.

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

శ్రీకాకుళం(ఘంటసాల): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జనరల్ అబ్జర్వర్ నరహరసింగ్ బంగర్ అన్నారు. శనివారం ఘంటసాల మండలంలో పర్యటించి సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం శ్రీకాకుళేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

# పెడనలో మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్లు 1,67,564 మంది
- పురుషులకంటే మహిళలు 1,548 మంది అధికం

పెడన: పెడన నియోజకవర్గంలోని ఓటర్లలో పురుషులకంటే మహిళలు అధికంగా ఉన్నారు. శనివారం ఓటర్ల తుది జాబితా అధికారులు ప్రకటించారు. పెడన నియోజకవర్గంలో 1,67,564 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 83,008 మంది ఉంటే మహిళలు 84,556 మంది ఉన్నారు. కృత్తివెన్ను మండలంలో మినహా మిగిలిన పెడన రూరల్, పెడన టౌన్, గూడూరు, బంటుమిల్లిలలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఓటర్లను పరిశీలిస్తే గూడూరు మండలంలో పురుషులు 19,723 మంది ఉంటే మహిళలు 20,126 మంది ఉన్నారు. మొత్తం 39,849 మంది ఉన్నారు. ఈ మండలంలో పురుషులకంటే మహిళలు 403 మంది ఎక్కువగా ఉన్నారు. పెడన రూరల్‌లో పురుషులు 13,879 మంది ఉంటే మహిళలు 13,972, మొత్తం 27,851 మంది ఉన్నారు. ఇక్కడ మహిళలు 93 మంది అధికంగా ఉన్నారు. పెడన పట్టణంలో మొత్తం ఓటర్లు 25,281 మంది ఉంటే వీరిలో పురుషులు 12,209, మహిళలు 13,072 మంది ఉన్నారు. 863 మంది మహిళలు అధికంగా ఉన్నారు. బంటుమిల్లి మండలంలో మొత్తం 36,633 మంది ఓటర్లు ఉంటే వీరిలో పురుషులు 18,181 మంది, మహిళలు 18,452 మంది ఉన్నారు. 271 మంది మహిళలు అధికంగా ఉన్నారు. కృత్తివెన్ను మండలంలో మొత్తం ఓటర్లు 37,950 మంది ఉంటే వీరిలో పురుషుల 19,016 మంది, మహిళలు 18,934 మంది ఉన్నారు. పెడన నియోజకవర్గంలో మహిళలు శాసించే స్థాయిలో ఉండటం విశేషం.


# పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ గెలవాలి



కోడూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కోడూరు: వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోరుతూ మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం వడ్డేరకాలనీ, మెరకగౌడపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌రరావు, ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు గెలిపించాలని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ పథకాలు అమలు చేశారని, ఇవి కొనసాగాలంటే మళ్లీ తప్పనిసరిగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని పార్టీ నేతలు తెలిపారు. నూతన మేనిఫెస్టోలో కూడా అమలు చేసే హామీలనే జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ కన్వీనర్ పరిశె మాధవరావు, బడే గంగాధరరావు, వెన్నా ప్రసాద్, లంకే రవి, తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి జగన్ సీఎం కావాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రంగనాథ్

ఘంటసాల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ అల్లుడు డాక్టర్ తన్నీరు రంగనాథ్ అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని యండకుదురు, లంకపల్లి, జీలగలగండి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కుమార్తెలు సింహాద్రి నిశ్చల, డాక్టర్ సహజ, అల్లుడు డాక్టర్ రంగనాథ్ ఎన్నికల ప్రచారం చేశారు. జీలగలగండి అంబేడ్కర్ విగ్రహానికి డాక్టర్ రంగనాథ్ ఘన నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి కర పత్రాలు పంచిపెట్టారు. ఎమ్మెల్యేగా మరోసారి సింహాద్రి రమేష్ బాబును, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, సర్పంచ్‌లు ముళ్లపూడి పట్టాభి రామారావు, దున్న విజయలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు ప్రజాదీవెన

గూడూరు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక గూడూరు మండలంలో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంటు, పెడన ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మల్లవోలు గరువు నుంచి ప్రారంభమయ్యే ప్రచారం రామన్నపేట, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో జరగనుంది.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెడన:మండల పరిధిలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మడక గ్రామానికి చెందిన శొంఠి హరికృష్ణ (34) ట్రాక్టర్ మెకానిక్. శుక్రవారం బల్లిపర్రులో ట్రాక్టర్ రిపేరు సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పక్కవాళ్ల ఆయన సోదరునికి సమాచారం ఇవ్వడంతో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొవడంతో పోస్టుమార్టంకు పంపించారు.హరికృష్ణభార్య వీరమ్మ ఫిర్యా దుపై పెడన ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

**ప్రజాదీవెనలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక**



కృత్తివెన్ను: తీరానికి అత్యంత చేరువగా ఉన్న ఉప్పులూరు గ్రామంలో ప్రతి ఇంటికీ పూర్తి స్థాయిలో తాగునీరందించే బాధ్యత తీసుకుంటానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. శనివారం ప్రజాదీవెనలో భాగంగా మండల పరిధిలోని చెరుకుమిల్లి పంచాయతీ ఉప్పులూరు గ్రామంలో ప్రతి గడపను ఆమె సందర్శించారు. నిరుపేదల సంక్షేమం కోసం అనుక్షణం జగనన్న పాటుపడుతున్నారని, అటువంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఫ్యాను గుర్తుపై ఓటేసి పెడన ఎమ్మెల్యేగా ఉప్పాల రామును, ఎంపీగా చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. తాగు నీటి సమస్యపై కొందరు మహిళలు చైర్‌పర్సన్‌కు తెలియజేయగా ఇప్పటికే గ్రామానికి బైపాస్ పైపులైను కోసం అన్ని పనులు పూర్తయ్యాయని, త్వరలో తాగునీరు ఇస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం బోర్డు చైర్మన్ నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జిల్లా బోర్డు సభ్యులు పట్టపు నాని, స్థానిక పార్టీ నాయకులు ఆంజనేయులు, అంజి, ఝాన్సి, షేక్ బేగం తదితరులు పాల్గొన్నారు.